క్లుప్తంగా

ఆంజనేయపురంలో జ్వర పీడితుల సర్వే



ఆంజనేయపురం(తిరువూరురూరల్): ఆంజనేయపురంలో చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య సిబ్బంది శనివారం జ్వర పీడితుల సర్వే నిర్వహించారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి అవసరమైన వైద్య సేవలందించారు. రోజుల తరబడి జ్వరం తగ్గకపోతే వైద్యసేవలు పొందాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాల్లో మురుగునీరు, వర్షం నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఏఎన్ఎం రామ కృష్ణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ మధుసూదన్‌రెడ్డి సర్వేలో పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మల్లేల(తిరువూరురూరల్): మల్లేల గ్రామంలో శనివారం గ్రామ ప్రత్యేకాధికారి టి. గాయత్రి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఎంపీపీ స్కూల్లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు, పౌష్టికాహారం పంపిణీని పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను తనిఖీ చేశారు. జాబ్‌కార్డుదారులందరికీ పనులు చూపాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను వివరించారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



ఇబ్రహీంపట్నం: తప్పిపోయిన బాలుడి కేసును పోలీసులు ఛేదించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. కొండపల్లికి చెందిన బాలుడు ఉదయ్‌కుమార్ స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. మూడు రోజుల కిందట పాఠశాల నుంచి తప్పిపోవడంతో బాలుడి తల్లి నరసమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సీఐ ఎం.సత్యనారాయణ పోలీసులను బృందాలుగా ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ఉన్న బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడిని అప్పగించిన సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.

పాముకాటుకు వ్యక్తి మృతి



ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరులో శనివారం పాము కాటుకు ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో స్వీట్ షాపు నిర్వహిస్తున్న రాజపురోహిత్ కిషోర్ (58) శుక్రవారం రాత్రి ఇంటి వద్ద నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు మంత్రం పెట్టించి నయం అవుతుందనుకున్నారు. శనివారం ఉదయం రాజపురోహిత్ కిషోర్ సొమ్మసిల్లి పడిపోగా వెంటనే మధిర ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. రాజస్తాన్ నుంచి వచ్చి 32 ఏళ్లుగా కిషోర్ గ్రామంలో మిఠాయి దుకాణం నిర్వహిస్తున్నాడు. మృతునికి భార్య, నలుగురు సంతానం.

పింగళి వెంకయ్య తెలుగు జాతికి గర్వకారణం

నూజివీడు: జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య తెలుగువారు కావడం తెలుగు జాతికి గర్వకారణమని మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పురాణం కృష్ణప్రసాద్ అన్నారు. పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం నూజివీడులోని స్నేహరైడ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన అనాథ పిల్లల హాస్టల్‌లో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. దీనిలో భాగంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్నేహ రైడ్స్ సంస్థ చైర్మన్ బసవరాజు నగేష్, మానవత సంస్థ సభ్యులు అనంతలక్ష్మి, శేషయ్య, సుభాని పాల్గొన్నారు.

8న పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు

ఆగిరిపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8న పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు నిర్వహిస్తామని ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష ఏఎల్ఎస్‌ఓ రాధాకృష్ణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఎన్నికల్లో పాటించాల్సిన విధి విధానాలను వివరించారు. అనంతరం పాఠశాలల్లో విద్యా కానుక కిట్లు అందరికీ చేరాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా సహిత కో–ఆర్డినేటర్ భాస్కరరావు, మండల విద్యా శాఖ అధికారులు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పడకేసిన పారిశుద్ధ్యం

- మరుగుదొడ్ల బేసిన్లు పగిలి దుర్వాసన
- ఆస్పత్రి భవనం పక్కనే వేస్తున్న చెత్తచెదారం
- నాచుపట్టిన వాటర్ ట్యాంక్

మైలవరం: మైలవరం ప్రభుత్వాస్పత్రి పరిసరాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. వర్షాకాలం కావడంతో విష జ్వరాల బాధితులు అధికంగా ఆస్పత్రికి వస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలో పారిశుద్ధ్య పరిస్థితులపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో ఉన్న మరుగుదొడ్ల బేసిన్లు పగిలి నీరు వెళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్తాచెదారాన్ని ఆస్పత్రి భవనం పక్కనే వేస్తున్నారు. ఇక వాటర్ ట్యాంక్‌లో నీరు నాచుపట్టి పురుగులు వస్తున్నాయి. ఈ నీటినే రోగులు, రోగుల వద్ద ఉంటున్న సహాయకులు బాత్ రూమ్‌కు, ఇతర అవసరాలకు ఉపయోగించాల్సి వస్తోంది. అసలే విష జ్వరాల వ్యాప్తితో భయాందోళన చెందుతున్న రోగులు ఈ నీటిని చూసి ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారింది. చెత్తా చెదారం, పిచ్చి మొక్కలతో దోమలు విస్తరించి రాత్రి వేళల్లో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కొంతమంది సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి నిర్వహణ ఈ విధంగా ఉంటే తమకు స్వాంతన ఎలా చేకూరుతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వివరణ ఇచ్చేందుకు ఆసుపత్రి అధికారులు అందుబాటులో లేరు.



మైలవరం ఆస్పత్రి ప్రాంగణంలో నాచు, పురుగులతో నిండిన వాటర్ ట్యాంక్



మైలవరం ఆస్పత్రి ప్రాంగణంలో చెత్త చెదారం, పిచ్చిమొక్కలు

గత ప్రభుత్వంలో అభివృద్ధి కమిటీ పర్యవేక్షణ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వీటిని పర్యవేక్షించేది. ప్రస్తుతం కమిటీ లేకపోవడంతో ఆ పరిస్థితి లేక రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆస్పత్రి నిర్వహణను అధికారులు కానీ, ఎమ్మెల్యే కానీ పట్టించుకునే పరిస్థితి లేదు. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఆస్పత్రి ప్రాంగణంలో నూతన భవనాన్ని నిర్మించారు. అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ నూతన భవన ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుతం టీడీపీలో చేరిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్థానిక సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

సౌకర్యాలు మెరుగుపర్చాలి



మైలవరం ప్రభుత్వాస్పత్రిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. వాటర్ ట్యాంక్‌లో నాచు పెరిగి, పురుగులు చేరినా పట్టించుకోవడం లేదు. ఆస్పత్రి అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాలి. సిబ్బంది రోగులను మంచిగా చూడాలి. రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉంచాలి.

– ఐ జమలయ్య, తోలుకోడు గ్రామం

మందులు అందుబాటులో ఉంచాలి



గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. మైలవరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు కావాల్సిన వైద్య సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీనితో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చార్జీలు భరించలేకపోతున్నాము. ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలి. మందులు అందుబాటులో ఉంచాలి.

– ఎస్. గంగులు, పుల్లూరు గ్రామం

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఈలప్రోలు, కేతనకొండ సెక్టార్ సూపర్ వైజర్లు రమాదేవి, జహీదాబేగం అన్నారు. క్లస్టర్ పరిధిలోని కిలేశపురం, కొండపల్లి నేతాజీనగర్‌లో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ద్వారా శిశువు ఆరోగ్యంగా ఎదగడానికి అవసరమైన పోషకాలు లభిస్తాయని చెప్పారు. తల్లి పాలకు మించిన పోషకాహారం ప్రపంచంలో ఏదీ లేదన్నారు. ముందుగా గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ క్రాంతి, మహిళా సంరక్షణ అధికారి కల్యాణి, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పసిబిడ్డలకు ముర్రుపాలు శ్రేష్ఠం

గంపలగూడెం: ఎంతో శ్రేష్ఠమైన ముర్రుపాలను పసిబిడ్డలకు తప్పనిసరిగా పట్టించాలని, తద్వారా విలువైన పోషకాలు లభించి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం గంపలగూడెం 64వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. వారు మాట్లాడుతూ డబ్బాపాలతో వచ్చే అనర్థాలను వివరించారు. తల్లిపాలతో పాటుగా ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న బాలామృతం ఆహారంగా ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, స్రవంతి, కస్తూరి, జ్యోతి, బుజ్జి, సునీత, వీఆర్వోలు పాల్గొన్నారు.



కిలేశపురంలో అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ జాహీదా బేగం



గంపలగూడెంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



జి.కొండూరులో అవగాహన కల్పిస్తున్న సీడీఎస్ సూపర్‌వైజర్ జోజి కటాక్షం

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెంపు..

నూజివీడు: బిడ్డకు తల్లిపాలు పట్టించడం వలన వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఓగిరాల తండా, హటియా తండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఆయా కేంద్రాల పరిధిలోని గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సూపర్ వైజర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరునెలల వయస్సు వచ్చేవరకు తల్లిపాలనే తాగించాలన్నారు. ఈ విషయంపై అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

ఆగిరిపల్లి: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ నూరాణి అన్నారు. శనివారం ఈదర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలన్నారు. తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ సంరక్షణ చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ నాగేశ్వరి, సూపర్‌వైజర్ రాగమయి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

జి.కొండూరు: తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, ప్రతి తల్లి ఈ సూక్తిని పాటిస్తూ తమ బిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ జోజి కటాక్షం అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా జి.కొండూరు ఎస్సీ ఏరియాలోని 75వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, తల్లులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ

నూజివీడు: మండలంలోని పడమర దిగవల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కోపూరి సుధాకర్ మాతృమూర్తి ఇటీవల మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సుధాకర్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుధాకర్ మాతృమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముసునూరు మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, పల్లే రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుధాకర్‌ను పరామర్శిస్తున్న ప్రతాప్ అప్పారావు

90 బస్తాల అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి షాదీఖానాలో అక్రమంగా నిల్వ ఉంచిన ప్రభుత్వ రేషన్ బియ్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ పాపారావు, ఆర్ఐ గోపి శనివారం ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ తాళం వేసి ఉన్న ఎండీయూ వాహనం తనిఖీ చేయగా లెక్కలో లేని 46 బస్తాలు బియ్యం ఉన్నట్లు గుర్తించారు. షాదీఖానా లోపల మరో 44 బస్తాలు నిల్వ ఉంచారు. మొత్తం 90 బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. వాహన నిర్వాహకుడే అక్రమంగా బియ్యం నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఎండీయూ వాహన నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



అక్రమంగా నిల్వ ఉంచిన ప్రభుత్వ రేషన్ బియ్యం తనిఖీ చేస్తున్న ఆర్ఐ గోపీ

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

మైలవరం: విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడతా లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులతో మండలంలో జ్వరాలు విస్తరిస్తున్నాయని, గ్రామస్తులు ముందస్తు జాగ్రతలు తీసుకోవాలన్నారు. దీనిలో భాగంగానే తమ పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొని విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. విద్యార్థుల బరువు, ఎత్తు కొలతలు నమోదు చేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి



సూరంపాలెంలో నినాదాలు చేస్తున్న మాలలు

చాట్రాయి: ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం చేయవద్దని మాల మహానాడు సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సూరంపాలెం గ్రామంలో మాల మహానాడు నాయకులు నక్కా రాము మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటామన్నారు. ఎస్సీల్లో ఇప్పటి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన కోరారు. తెలంగాణలో మాదిగ సోదరులు ఎక్కువ ఉన్నారని, ఏపీలో మాలలు ఎక్కువగా ఉన్నారని, జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో దార్ల ధర్మారావు, మొండ్రు నారాయణ, తోట రాంబాబు, కొక్కెరగడ్డ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద లేకుండా చర్యలు

సాక్షి ఎఫెక్ట్

ఆగిరిపల్లి: గ్రామంలో కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకుంటామని ఈఓపీఆర్డీ శేఖర్ అన్నారు. కుక్కల దాడిలో గేదె మృతి శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఈఓపీఆర్డీ శేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే వీధి కుక్కల దాహార్తిని తీర్చేందుకు గ్రామంలో నీటి తొట్లెలు ఏర్పాటు చేశామన్నారు. కుక్కల సంతతి పెరగకుండా కుక్కలకు కుటుంబ నియంత్రణ వ్యాక్సిన్లు వేయడానికి పశుసంవర్ధక శాఖాధికారులకు సమాచారం అందించామని చెప్పారు. వారు తీసుకునే చర్యలకు సహకారం అందిస్తామని శేఖర్ తెలిపారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

నూజివీడు: వయనాడ్ వరద బాధితుల సహాయార్థం నూజివీడు పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. పట్టణ ప్రజలు, దుకాణాల వద్ద విరాళాలు సేకరించగా సహాయనిధికి రూ.6,110 వసూలయ్యాయని, వీటిని వయనాడ్ బాధితులకు పంపిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. రాజు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎన్ఆర్ హనుమాన్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు

తిరువూరు: గిరిజన ప్రజలకు ఉచిత వైద్యసేవలందించడం అభినందనీయమని తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. ఎ. కొండూరు మండలం జీళ్లకుంటలో తిరువూరు న్యాయ సేవాధికార సంస్థ శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ ప్రారంభించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలైన గిరిజనులకు నాణ్యమైన విద్యనందించేందుకు వైద్యారోగ్య శాఖ కృషి చేయాలని సూచించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్న ఎ. కొండూరు మండలంలో ఉచిత వైద్య సేవలు విస్తృతంగా చేయాలన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి సుహాసిని, ఎన్‌సీడీ–సీడీ కార్యక్రమ అధికారి మాధవి, జిల్లా మలేరియా అధికారి మోతీబాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ పరమాత్మ, తహసీల్దార్ ఆశయ్య, వైద్యాధికారులు స్వాతి, శృతి పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, డీఎంహెచ్ఓ, జడ్జి

లెప్రసీ, బోధ వ్యాధిగ్రస్తులకు సూక్ష్మ రుణాల పంపిణీ

ఊటుకూరు(గంపలగూడెం): మండలంలోని ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లెప్రసీ, బోధకాలు వ్యాధిగ్రస్తులకు మ్యాన్‌కైండ్ ఫ్మారా ఆర్థిక సహాయంతో లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సూక్ష్మ రుణాలను అందజేశారు. ఊటుకూరు పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు శశిప్రియ సంబంధిత చెక్కులను బాధితులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ సూక్ష్మ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లెప్రా సొసైటీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ రాధిక మాట్లాడుతూ జిల్లాలో పది మంది కుష్ఠువ్యాధిగ్రస్తులు, బోధకాలు ఉన్న రోగులకు రుణాలను అందజేస్నామని చెప్పారు. లెప్రా సొసైటీ ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ మాట్లాడుతూ లెప్రసీ, బోధవ్యాధిగ్రస్తులకు మ్యాన్‌కైండ్ ఫార్మా సహకారంతో అవసరమైన మందులు, పాదరక్షలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. లెప్రా సొసైటీ నోడల్ ఆఫీసర్ బీవీఆర్ మూర్తి, ఓఆర్ డబ్ల్యూ పి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.



రోగులకు సూక్ష్మ రుణాల చెక్కులు అందజేస్తున్న వైద్యులు శశిప్రియ

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

డీఎల్‌పీఓ సుందరి

చాట్రాయి: నరసింహారావుపాలెం పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను నూజివీడు డివిజినల్ పంచాయతీ అధికారి సుందరి శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామ పంచాయతీలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుచ్చకాయల సుబ్బారెడ్డి, సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి, ఉప సర్పంచ్ మందపాటి రఘుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు విస్సంపల్లి సీతయ్య, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. చీపురుగూడెం పంచాయతీ ఆధ్వర్యంలో డ్రెయినేజీల్లో పూడిక తీసి మురుగు నీటిని బయటకు తరలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఓబిళ్లనేని వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

సంక్షిప్త వార్తలు

పేద విద్యార్థులకు ఆర్థికసాయం



తిరువూరు: ఉన్నత విద్య నభ్యసించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇరువురు పేద విద్యార్థులకు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శనివారం ఆర్థిక సహాయం చేశారు. విస్సన్నపేట మండలం పుట్రేలకు చెందిన ఒక విద్యార్థి విశాఖపట్నంలో మెడిసిన్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా ఫీజు చెల్లింపునకు ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మెడిసిన్ కోర్సు పూర్తయ్యే వరకు తనవంతు సహాయం అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్న తిరువూరు విద్యార్థికి మరో రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

జి.కొండూరు: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై స్థానిక మాదిగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం రాత్రి జి.కొండూరు ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన ఎస్సీ సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు పరసా రామయ్య మాదిగను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మండల అరుణ, ఎస్సీ సంఘాల నాయకులు మందా కాంతయ్య, బట్టపర్తి రాజు, మండల శేఖర్‌బాబు, బట్టపర్తి శేఖర్ పాల్గొన్నారు.

విత్తన దుకాణం తనిఖీ

ముసునూరు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయాధికారి సందిపాము మధుమోహన్ విత్తన దుకాణదారులను హెచ్చరించారు. శనివారం ఆయన ముసునూరులోని విత్తన దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, రైతులకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను, స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్‌లు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు.

వలంటీర్లను కొనసాగించాలి

తిరువూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలకంగా వ్యవహరిస్తున్న గ్రామ, వార్డు వాలంటీర్లను కొనసాగించాలని సీపీఐ అనుబంధ ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి మాధవికి వినతిపత్రం అందజేశారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని, ఎన్నికల ముందు రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్ వేతనాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సుబానీ, స్థానిక నాయకులు మాలపాటి ఉదయ్, వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

తిరువూరు: ఇంటింటా మొక్కలు నాటి తిరువూరు పట్టణంలో పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు నందించాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. స్థానిక ఏడో వార్డులో శనివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థలు మొక్కలు పెంపకానికి కృషి చేయాలని సూచించారు. నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, వార్డు కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లూరి రామకోటేశ్వరరావు, సభ్యులు పసుమర్తి వెంకటేశ్వరరావు, కిలారు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

గుళ్లపూడి(గంపలగూడెం): గంపలగూడెం మండలం గుళ్లపూడిలోని ఓ ఇంట్లో పేకాడుతున్న వారిపై పోలీసులు దాడిచేశారు. ఎస్ఐ ఎస్. శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. అందిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి శనివారం దాడి చేశారు. పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.26 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

తెలంగాణ మద్యం విక్రేతల అరెస్ట్



తిరువూరు/గంపలగూడెం: తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని గంపలగూడెం మండలంలో తెలంగాణ మద్యం విక్రయిస్తూ ఇరువురు వ్యక్తులు శనివారం పట్టుబడినట్లు ఎస్ఈబీ సీఐ అశోక్ తెలిపారు. కొణిజర్ల, ఎన్టీఆర్ నగర్‌లలో నోముల రవి నుంచి 20, కొంగల రాములు నుంచి 50 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. నిందితులను గంపలగూడెం తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు.